ప్రజాశక్తి
సోమవారం 7 ఆగస్టు 2023 5 అనంతపురం



అసైన్డ్ భూములపై ప్రభుత్వ ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భూమి లేని గ్రామీణ పేదలు, దళితుల అభ్యున్నతి, ఆత్మగౌరవం, జీవనోపాధి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వమే అమ్ముకోవచ్చని ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా తప్పుపట్టింది. ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములపై తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ భూములు పెద్ద సంఖ్యలో అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. అక్రమంగా భూములు పొందిన వారికి శాశ్వతంగా కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా ఆర్డినెన్స్ తెచ్చిందని విమర్శించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వారిలో రెండున్నర ఎకరా మాగాణి, 5 ఎకరాల మెట్ట ఉన్న రైతులు ఆసైన్డ్ భూములు కలిగి ఉంటే వారిని మినహాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళనల ఫలితంగా సుమారు 32 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందన్నారు. అందులో సుమారు 15 లక్షల ఎకరాలకు పైగా అన్యాక్రాంతం అయినట్లు కోనేరు రంగారావు భూ కమిటీ చెప్పింద న్నారు. అనేక చోట్ల భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు పారిశ్రామిక కేంద్రాలు, అక్వా చెరువులు, విద్యాలయాలు, నేషనల్ హైవేలు, సోలార్‌ప్లాంట్లు, గాలిమరల కేంద్రాల పేరుతో దళితులకు చెందిన అసైన్డ్ భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని విమర్శించారు. హీరేహాల్, గుంతకల్లు, కంబదూరు మండలాల్లో గుజరాత్‌కు చెందిన గౌతం అదాని కోసం సుమారు 25 వేల ఎకరాల భూమిని ఏఐఐసి ద్వారా సేకరిస్తున్నారన్నారు.ఇందులో అత్యధిక భూములు దళితులు, భూమిలేని నిరుపేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములే ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే తాడిపత్రి మండలం తలారి చెరువు గ్రామంలో సోలార్ ప్లాంట్, చిలమత్తూరు మండలం లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం సేకరించిన భూమిలో అత్యధికం అసైన్డ్ భూములు ఉన్నాయని చెప్పారు. కూడేరు మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను గాలిమరల ఏర్పాటుకు, అహుడా ద్వారా ప్లాట్ల వ్యాపారానికి ప్రభుత్వమే బలవంతాన లాగేసుకుంటుందన్నారు. నేడు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ఆ భూములను కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్‌లకు, భూస్వాములకు కట్టబెట్టడానికే చట్ట సవరణ చేసి గవర్నర్ ద్వారా జూలై 31న ఆర్డినెన్స్ తెచ్చిందని విమర్శించారు. సవరించిన సెక్షన్ 3 లో అసైన్డ్ భూమి మాస్టర్ ప్లాన్ ప్రక్కన వ్యవసాయేతర అవసరాల కోసం (పరిశ్రమలు, విద్యాలయాలు, ఆక్వా, ఇతరములు) అక్రమించుకున్నట్లయితే ఆ భూములకు మార్కెట్ రేట్ ప్రకారం డబ్బు చెల్లించాలని సవరణ చేశారన్నారు. ఈ సవరణ ద్వారా ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను ఇలాంటి తప్పుడు పద్దతుల పేరుతో రాజమార్గంలో కొట్టేయడానికి భూస్వాములకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దురాక్రమణ చేసిన భూములను, పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించని ఖాళీ భూములను వాస్తవ అసైన్డ్‌దారుల పరం చేయాలని డిమాండ్ చేశారు. పేదలు పొందిన అసైన్డ్ భూములను అభివృద్ధి చేసుకుని వారి జీవితాలు, వారి పిల్లల భవిష్యత్ అభివృద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, సాగునీటి సౌకర్యం, పరపతి సౌకర్యం కల్పించి అభివృద్ధి చేయాల్సింది పోయి భూములు అమ్ముకోమని ప్రోత్సహించడం అభివృద్ధి నిరోధక చర్య అని అన్నారు. ప్రభుత్వం తెచ్చిన సవరణ ఆర్డినెన్స్ భూముల హక్కుదారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు మేలు చేస్తుందని విమర్శించారు. అసైన్డ్ భూములను రక్షించుకోవడానికి సిపిఎం ఆధ్వర్యంలో ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు.

వైసిపి నాయకుల జేబులు నింపడానికే జిల్లేడు బండ ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, పాల్గొన్న ఉమ్మడి జిల్లా టిడిపి ప్రధాన నాయకులు

ప్రజాశక్తి ముదిగుబ్బ, బుక్కపట్నం

శ్రీ సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ మండల పరిధిలో జిల్లేడుబండ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించడం లేదని.. అది సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి జేబులు నింపుకునేందుకే నిర్మిస్తున్నారని ఉమ్మడి జిల్లా టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండా సమీపంలో ఉన్న జిల్లేడుబండ రిజర్వాయర్‌ను పరిశీలించారు. స్థానికంగా ఉన్న రైతులు, ముంపు బాధితులు, నిర్వాసితులతో టీడీపీ నాయకులు ఈసందర్భంగా మాట్లాడారు. వారి ఇబ్బందులు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, పార్థసారధి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కందికుంట ప్రసాద్, తిప్పేస్వామి, బండారు శ్రావణి, ఉమా మహేశ్వర్ నాయుడు, ఎం ఎస్ రాజు, నరసానాయుడు, అంబికా లక్ష్మినారాయణ, రాష్ట్ర, సాధికార కమిటీల అధ్యక్షులు, ఇతర టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో వైసీపీ నేతలు ఎలా దోచుకుంటున్నారో చెప్పేందుకు ఈ ప్రాజెక్టు ఉదాహరణగా నిలుస్తోందన్నారు. 300కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తయ్యే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రెండింతలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ కు అత్యంత సన్నిహితుడైన తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఈ ప్రాజెక్టు అప్పజెప్పారన్నారు. అసలు ఈ ప్రాజెక్టు నిర్వాసితులతో కేతిరెడ్డి కానీ, అధికారులు కాని ఎప్పుడైనా మాట్లాడారా అని నిలదీశారు. ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి వచ్చి రైతులకు ఎలాంటి హామీ ఇవ్వకుండా కాకమ్మ కబుర్లు చెప్పి వెళ్లారని విమర్శించారు. రైతులను ఆదుకునేంత వరకు ఈ ప్రాజెక్టు నిర్మించడానికి వీలు లేదని... దీనిపై టీడీపీ పోరాడుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ధరకు రెండున్నరింతల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.టిడిపి ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నిర్వాసితులకు కనీసం న్యాయం చేస్తామనిచెప్పే పరిస్థితుల్లో కూడా ఎమ్మెల్యే, అధికారులు లేరంటే పరిస్థితి ఎంత దారుణం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ఇక్కడ అమలు కావడం లేదన్నారు.రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గిస్తామని చెప్పే జగన్.. ఇప్పుడు ఎలా పెంచారని ప్రశ్నించారు. టిడిపి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారధి మాట్లాడుతూ ప్రాజెక్టులకు తాము దానికి వ్యతిరేకం కాదని. కానీ ఇంత విస్తీర్ణంలో ఎందుకు కట్ట నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. రైతులు ఒప్పుకున్న తరువాతనే ప్రాజెక్టు నిర్మించాలని.. కానీ ఇక్కడ రైతులు వ్యతిరేకిస్తున్నా ప్రాజెక్టు నిర్మిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ ప్రధాని మోడీ తరహాలోనే సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే ఇదంతా కమీషన్ల కోసమేనన్నది అర్థమవుతోందన్నారు.ఈ కార్యక్రమంలో కాలవ శ్రీనివాసులు, పార్థసారధి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కందికుంట ప్రసాద్, తిప్పేస్వామి, బండారు శ్రావణి, ఉమా మహేశ్వర్ నాయుడు, గుండుమల తిప్పేస్వామిచ ఎం ఎస్ రాజు, నరసానాయుడు, అంబికా లక్ష్మినారాయణ, వడ్డే వెంకట్ సామకోటి ఆదినారాయణ ముదిగుబ్బ బత్తలపల్లి తాడిమర్రి ధర్మారం రూరల్ కన్వీనర్లు రైతు సంఘం నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మండలంలో రైతులు సాగుచేసిన వరినార్లు

ముదురుతున్న వరినార్లు

సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ఆయకట్టు కింద పంట సాగు చేసే రైతులు బోరు బావులు కింద వరి నారు సాగు చేసి నాట్లు వేయడానికి సిద్ధమయ్యారు ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో సోనా మసూరి, నెల్లూరు సోనా నాట్లు వేస్తే దిగుబడి బాగా వస్తుందని రైతుల అంచనా. 64 రకం, ఆర్ఎన్ఆర్ రకం సెప్టెంబర్ మొదటి మాసంలో నాట్లు వేయవచ్చని, సోనా మసూరి రకానికి 40 రోజుల వరినారును నాట్లు వేస్తే దిగుబడి బాగా వస్తుందని స్థానిక రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం ఈ సమయానికి మండలంలో 50 శాతం వరినాట్లు పూర్తి అయ్యాయి. అయితే ఈ ఏడాది ఆలస్యంగా వర్షాలు రావడంతో సాగు నీరు అందలేదు. అయితే రైతులు మాత్రం సకాలంలో నాట్లు వేయవచ్చన్న ఆలోచనతో వరినార్లు భారీగా సాగు చేశారు. వరినారు పోసిన 40 రోజుల లోపు నాట్లు వేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ప్రస్తుతం నారు ముదిరిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదిరిన నారును నాటితే సోనామసూరి రకం, నెల్లూరు సోనా దిగుబడి భారీగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆగస్టు రెండో వారంలో అయిన సాగునీరు అందిస్తారా అని ఆయకట్టు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆర్ఎన్ఆర్ రకం వరిని సాగు చేయడానికి అవసరమైన నారు పోయడానికి కూడా సాగునీరు అవసరమని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయకట్టుకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సమావేశం నిర్వహించి నీటి శాతాన్ని బట్టి కేటాయింపులు చేసి సాగునీటి విడుదలకు తేదీని త్వరలో ఖరారు చేయాలని రైతులు కోరుతున్నారు.

న్యాయవాది నిత్య విద్యార్థి

జిల్లా ప్రిన్సిపల్,సెషన్సు జడ్జి జి.శ్రీనివాస్

'అనంత'లో జరిగిన ఎఐఎల్‌యు ద్వితీయ జిల్లా మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి


ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

న్యాయవాద వృత్తిలోనున్న వారు నిత్య విద్యార్థిగా ఉండాలని జిల్లా ప్రిన్సిపల్, సెషన్సు జడ్జి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని విజయనగర లా కళాశాలలో ఎఐఎల్‌యు (ఆల్ ఇండియా లాయర్సు యూనియన్) జిల్లా ద్వితీయ మహాసభ ఆదివారం జరిగింది. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీతారామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, ఎఐఎల్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాస్ 'లెక్చర్ ఆఫ్ స్పెసిఫిక్ రిలీఫ్ యాక్టు'పై ప్రసంగించారు. అంతకు మునుపు మిత్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. సమాజంలో ఎటువంటి మిత్రులను కలిగి ఉండాలన్న అంశంపై మహాభారతంలోని కథాంశాలను తీసుకుని విఫల మిత్రుత్వం, సఫల మిత్రుత్వం, సుఫల మిత్రుత్వం గురించి వివరించారు. సుఫల మిత్రత్వమంటే అర్జునుడు, శ్రీ కృష్ణుడిని చెప్పుకోవచ్చునని అన్నారు. సుఫల మిత్రుత్వం అంటే పది మందికి ఉపయోగపడే విధంగా చేయడమని పేర్కొన్నారు. ఆ తరువాత స్పెసిఫిక్ రిలీఫ్ యాక్టులోని ఏడు ప్రధాన అంశాలను వివరించారు. న్యాయవాద వృత్తిలోనున్న వారు ఎప్పటికప్పుడు వస్తున్న తీర్పులను పరిశీలించడం, అధ్యయనం చేయడం వంటివి చేస్తూ ఉండాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ ఇండియన్ ఎవిడెన్సు యాక్టుపై మాట్లాడారు. రిటైర్డు జడ్జి శివశంకర్ మాట్లాడుతూ న్యాయవాది వృత్తిలోనున్న వారు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వారు పార్టీతో భాగస్వామ్యులు కాకుండా ఉండే విధంగానూ జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఎఐఎల్‌యు జాతీయ నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న వారైనా, వృత్తిలోనున్న వారైనా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలని సూచించారు. వృత్తిపరమైన నైపుణ్యం సాధించేందుకు ఎప్పటికప్పుడు తర్ఫీదు అవకపోతే వెనుకబడిపోక తప్పదని తెలిపారు. బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించిందన్నారు. అందులో తాను సభ్యుడిగానున్నట్టు చెప్పారు. త్వరలో న్యాయవాద రక్షణ చట్టం వచ్చే అవకాశాలున్నాయని వివరించారు. న్యాయవాద వృత్తి నైపుణ్యం పెంచే కార్యక్రమాలను బార్ కౌన్సిల్ చేపడుతోందన్నారు. ఎఐఎల్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమర్జెన్సీ పరిస్థితుల్లో 1975 తరువాత దేశ వ్యాప్తంగా న్యాయవాదులకు ఒక సంఘం అవసరమని భావించి మహోన్నతమైన వ్యక్తులంతా కలసి ఎఐఎల్‌యుని 1982లో స్థాపించారన్నారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ సంఘం విస్తరించిందన్నారు. న్యాయవాదుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడమే కాకుండా సామాజిక సమస్యలపైనా స్పందించడం జరుగుతోందన్నారు. కోవిడ్ సమయంలోనూ ఆసుపత్రుల్లో ఫీజులు అధికంగా వసూలు చేయడంపైన పిల్ వేయడం జరిగిందన్నారు. దాని తరువాతే ప్రభుత్వం ఆసుపత్రులపై నియంత్రణ చేపట్టిందని వివరించారు. న్యాయవాద వృత్తిలోనున్న వారికి అవసరమైన తోడ్పాటు సహకారాన్ని అందించే విధంగానూ ఈ సంఘం పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో విజయనగర లా కళాశాల ప్రిన్సిపల్ రాఘవేంద్రాచారి, సీనియర్ న్యాయవాదులు హరినాథరెడ్డి, విజయ్ కుమార్, బార్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ వెంకటరాముడు, న్యాయవాదులు రంగ నాయకులు, సిపి గౌడ సుదర్శన్, ధరమ్ సింగ్, జూనియర్ న్యాయవాది విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు జలవనరులు కీలకం

జల వనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి





జల వనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మానవజాతి మనుగడకు జల వనరులు కీలకమని జల వనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మానవుడు తన అవసరాల నిమిత్తం నీటిని ఇష్టానురీతిన వినియోగిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని దాంతో గ్రామాలు, పట్టణాలు, అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి నెలకొంటోందని ప్రభుత్వం ఎంతగా నిధులు ఖర్చు చేసినా సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. రుతుపవనాలు అనిశ్చిత ఉష్ణోగ్రతలు మార్పులతోపాటు జల సంరక్షణపై నిర్లక్ష్య కారణంగా రానురానూ నీటి ఎద్దడి జటిలమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో బావులు, బోర్లు, చెరువులు, వాగులు ఎండిపోవడం సర్వసాధారణమైందని దీంతో నీటి సంరక్షణ కొరకు రైతులు ఆరుతడి పంటలు వేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఎక్కువ నీటిని వినియోగించకుండా, వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసిపట్టాలనికోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సత్య సాయి జిల్లాలో నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: నీటి సంరక్షణలో భాగంగా సత్య సాయి జిల్లాలో వర్షపు నీటి సేకరణ, చెరువులు కాలవలు త్రవ్వడం, నీటి రిజర్వాయర్లను విస్తరించడం, వర్షపు నీటిని సేకరించేందుకు వివిధ పద్ధతులను అవలంబిస్తున్నాం. జల వనరులను సంరక్షణ అందరి బాధ్యత. వర్షపు నీటిని ఆదా చేయటం భూగర్భ జలాలను పెంపొందుతాయి. మానవజాతి మనుగడకు జల వనరులు కీలక పాత్ర వహిస్తున్నాయి. నీటి సంరక్షణ కొరకు చెక్‌డ్యాంలు, వర్షపు నీటి నిల్వ కేంద్రాలు, నిలువ చేయడానికి నీటి గుంతలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్ర : జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది ఎంత వర్షపాతం నమోదు అవుతోంది ?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా జులై 2023 నాటికి సాధారణ వర్షపాతం 137.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 108.7 మిల్లీమీటర్లు కురిసింది. దీంతో 25.9 శాతం లోటు ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ బోర్లు 1,11,813 ఉండగా, 2023 జులై నాటికి 39.5 శాతం భూగర్భంలో నీటి నిల్వలు ఉన్నాయి. భూగర్భ జలాల నీటి స్థాయి 9.57 మీటర్లుగా నమోదయింది. భూగర్భ గల జలాల లభ్యత 39.5 కాగా వాటిలో వాడుకున్నది 22.4 టీఎంసీలు నిల్వ ఉంది.17.1 టీఎంసీలు వృద్ధి చెందింది.

ప్ర : వాల్టా చట్టం అమలు చేస్తున్నారా?

జ: వాల్టా చట్టము జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నాం. జిల్లాలో 46 గ్రామాలను నిషిద్ధ గ్రామాలుగా ప్రకటించడం జరిగింది. మునుపటి సంవత్సరం 98 గ్రామాలు నిషిద్ధ గ్రామాలుగా ప్రకటించిగా ప్రస్తుతం ఈ సంవత్సరానికి 46 గ్రామాలకు కుదించడం జరిగింది. తమ గ్రామాలను వాల్టా చట్టం నిషిద్ధ గ్రామంగా తీసివేయాలని చాలామంది ప్రజలు కోరుతున్నారు .అయితే నిషిద్ధ గ్రామాల జాబితాను తయారు చేసేటప్పుడు ప్రభుత్వం వారు నిర్ణయించిన మేరకు గడచిన పది సంవత్సరాలు వర్షపాతాన్ని లెక్క కట్టడం జరుగుతుంది.

ప్ర : జిల్లాలో సాగు, తాగునీటికి భూగర్భ జలాలు సురక్షితమా ?

జ : సత్య సాయి జిల్లాలో భూగర్భ జలాలు, తాగటానికి వ్యవసాయానికి అనుకూలంగానే ఉన్నాయి. నీటిలో ఖనిజ లవణాలు తగినంత మోతాదులో ఉన్నాయి. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ నందు నమూనాలను సేకరించి ప్రయోగశాలలో ఖనిజ లవణాల స్థాయిని పరీక్షించాం. జిల్లాలో వాటర్ ప్లాంట్ల వారు విక్రయిస్తున్న శుద్ధ జలాలు సురక్షితం కాదని ,ఈ నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే ఖనిజ లవణాలు, శరీరానికి కావలసిన శక్తిని సైతం కోల్పోవడం జరుగుతుందని ఈ పరీక్షల్లో తేలింది. గతంలో పంచాయతీలు, మున్సిపాలిటీ సరఫరా చేసే నీటిని తాగేవాళ్లం. అప్పుడు మన శరీరానికి కావలసిన ఖనిజ లవణాలు నీటి ద్వారా పుష్కలంగా అందేవి. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ల నీటిని తాగుతుండడం వల్ల మన ఆరోగ్యాన్ని మన చేతులారా పోగొట్టుకుంటున్నాం. ఖనిజ లవణాలు, పోషక విలువలు లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం .చిన్న చిన్న సందర్భాల్లో క్రిందపడితే చేతులు కాళ్లు విరిగిపోవడం జరుగుతున్నాయి, డాక్టర్లు సైతం ఈ నిజాన్ని ఒప్పుకుంటున్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తిని కాపాడుకుందాం

ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

క్విట్ ఇండియా స్ఫూర్తిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఆ విధానాలను ఎండగట్టి క్విట్ ఇండియా స్ఫూర్తిని కాపాడుకుందామని ట్రేడ్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం క్విట్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. బళ్ళారి బైపాస్‌లోని స్ప్రింగ్ ఫ్యాక్టరీ నుంచి ప్రారంభమైన స్కూటర్ ర్యాలీ ఫ్లైఓవర్ బ్రిడ్జి, టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ స్కూటర్ ర్యాలీ సాగింది. ర్యాలీలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఏఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఐఎఫ్‌టియు ఏసురత్నం, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, తిరుమలేష్, శివపసాద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, మల్లికార్జున మాట్లాడుతూ ఆగస్ట్ 9న క్వింట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం క్విట్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీసిందన్నారు. అందుకే ప్రజలందరూ మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడదామన్నారు. ఈ నెల 8వ తేదిన నగరంలో మానవహారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదిన కేంద్ర ప్రభుత్వ సంస్థల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.



స్కూటర్‌ర్యాలీ నిర్వహిస్తున్న ట్రేడ్‌యూనియన్ల నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నారసింహుడిని దర్శించుకున్న జడ్జి దంపతులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీ నవ నరసింహస్వామిని జడ్జి లావణ్య దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. లావణ్య కడప జిల్లా కమలాపురం సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనేపథ్యంలో లావణ్య దంపతులు పట్టణానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆడియన్ స్వామి దాసన్ ఎపి రామమూర్తి స్వామీజీ, ప్రధాన అర్చకులు సుబ్రమ్మణ్యశర్మ మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీస్సులు అందించారు. తర్వాత ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పూలమాల, శాలువాతో దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, సభ్యులు గురునాథరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి లావణ్య దంపతులు

వన్ పెన్షన్‌లో లోపాలను సరిదిద్దాలి

ప్రజాశక్తి-అనంతపురం

వన్ పెన్షన్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలని మాజీ సైనిక సంఘం నాయకులు కెప్టెన్ షేకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని హెచ్.ఎల్.సి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా వన్ ర్యాంక్ వన్ పెన్షన్ సాధించుకునే వరకూ ఆందోళనలు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. యుద్ధంలో పాల్గొనేటప్పుడు అందరికీ సమానంగా ప్రాణహాని ఉంటుంది కనుక సమానంగా మిలిటరీ సర్వీస్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన వారికి వికలాంగ భృతి ఇవ్వాలని, ఐఎఫ్‌టి పెంచాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, బషీర్‌అహ్మద్, అబ్దుల్‌ఖాదర్, కుమారస్వామి, నాగిరెడ్డి, ఖాజామొద్దీన్, ఆర్ఎస్.నాగరాజు, నరసింహులు, హుస్సేన్‌బాషా, రవికుమార్, వై.ప్రసాద్, నబీరసూల్, మహమ్మద్‌గౌస్, వెంకట రమణారావు, జగన్‌మోహన్‌నాయుడు, పార్నపల్లి బాబా, సిద్ధన్న, ఎకె మొయిద్దీన్, బాలస్వామి, మదార్‌సాబ్, నంజుండయ్య, బాబా రత్నం, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సైనికులు


స్థానిక అధికారులతో మాట్లాడుతున్న
రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

యువతకు క్రీడల్లో శిక్షణ

రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉత్సాహవంతులైన యువతీ, యువకులకు క్రీడారంగంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని 1వ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమం కింద ఈ ఏడాది నుంచి ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఉత్సాహవంతమైన యువతీ, యువకులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి సచివాలయాల స్థాయిలో మండల టీం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి మండలస్థాయిలో, మండల స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లాస్థాయిలో, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ కేశవనాయుడు, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ బి.విజయభాస్కర్, మండల విద్యాధికారి లింగానాయక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రతాపరెడ్డి, గ్రామ కార్యదర్శి సాదిక్‌వలి, ఎపిఒ పోలేరయ్య, ఇసి ప్రసాద్ పాల్గొన్నారు.

8న విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న విజయవాడలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పరిమి సోమశేఖర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిఎం జగన్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రభుత్వ, కార్పొరేట్ సెక్టార్ ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. గతంలో వచ్చే జీతాలను కూడా తగ్గించే పరిస్థితికి దిగజారిపోయారన్నారు. విద్యుత్ ఉద్యోగులకు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి పే రివిజన్ కమిటీ వేసి పిఆర్‌సి ఇచ్చేవారన్నారు. 2018లో ఆర్థికలోటు ఉన్నా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 27 శాతం ఇవ్వగా, నేడు 2, 5, 7శాతం అంటూ చర్చల్లో బేరాలడటం బాధాకరమన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన ప్రయోజనాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఇపిఫ్ నుంచి జిపిఫ్ అమలు చేయాలని, వెంటనే పే రివిజన్ అమలు పరచాలని, కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ, చనిపోయిన గ్రేడ్- 2 జెఎల్‌ఎంల కుటుంబాలకు వెంటనే ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న మహాధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

పౌరాణిక నాటక రంగంలో విశేషంగా కృషి చేసి బళ్లారి రాఘవ అవార్డు పొందిన ఉపాధ్యాయుడు చిదంబరరెడ్డిని ఆదివారం పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న శ్రీ సాయి జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ జయ రంగారెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా చిదంబర రెడ్డి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ మరోవైపు పౌరాణిక నాటకాల్లో వివిధ వేషధారణలు ధరించి ప్రజలకు నీతిని బోధిస్తున్నారని చెప్పారు. మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పౌరాణిక నాటక రంగంలోని గురువులు, తోటి కళాకారులైన రంగస్వామి, ఏకాంతమయ్య, లాలేంద్ర, విశ్వనాథ ఆచారి, శ్రీనివాసరెడ్డిని చిదంబరరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, న్యాయవాది రామ్మోహన్‌రెడ్డి, బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు షేక్షావలి, ఉపాధ్యాయులు ప్రసాద్, చక్రపాణి, రాజేష్, వెంకటరాముడు, దుర్గాప్రసాద్, రవి, ఆటో యూనియన్ నాయకులు రామంజి, నజీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బళ్లారి రాఘవ అవార్డు పొందిన ఉపాధ్యాయుడు చిదంబరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

హిందూపురం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు బాల, బాలికలను ఎంపిక చేశారు. స్థానిక స్పార్టన్ చెస్ అకాడమీలో ఆదివారం అండర్-15 బాల, బాలికలకు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌బాబు, కార్యదర్శి నాగార్జున, టోర్నమెంట్ డైరెక్టర్ ఆరీఫుల్లాఖాన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-15 బాలుర విభాగంలో తనిష్క్, చింతా జయకృష్ణ, కేదార్‌నాథ్ గుప్తా, యశ్వంత్, బాలికల విభాగంలో వైష్ణవి, మోక్షిత, చందన సహస్ర, జ్ఞాపికరెడ్డి వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు.

చుండూరు మృతులకు నివాళి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) నాయకులు ఆదివారం చుండూరు మృతవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండతో అగ్రకుల పెత్తందారులు దళితులపై దాడులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితులు పోరాడి సాధించుకున్న చట్టాలు, సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు నీరు కారుస్తున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్, బిజెపిలకు చెందిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపైన మరింత దాడులు పెరిగినాయన్నారు. వీటికి వ్యతిరేకంగా అణిచివేతకు గురవుతున్న ప్రజలందరూ ఐక్యమై ఆందోళనలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, నాయకులు సత్తార్, గోపి, బాషా, జానయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


చుండూరు మృతులకు నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు


టేబుల్ టెన్నీస్ ఆడుతున్న శ్రీశాన్వి

టిటి పోటీల్లో శ్రీశాన్వి ప్రతిభ

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని లోలూరు గ్రామం వద్ద ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న శ్రీశాన్వి విజయవాడలో జరిగిన అండర్-13 టేబుల్ టెన్నిస్ పోటీల్లో అత్యంతి ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో 3-1 స్కోర్‌తో జట్టు ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. ఈజట్టులో మూడోస్థానంలో నిలిచిన శ్రీశాన్విని పాఠశాల జిఎం రామసుబ్బారెడ్డి, సిఇఒ ప్రతాపరెడ్డి, ఎజిఎం శంకర్‌నారాయణ, తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాను, అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిపై అసత్య ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-ఉరవకొండ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై టిడిపి అధినేత చంద్రబాబు చేస్తున్న అసత్య ఆరోపణలు తగదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. అంగళ్లు, పుంగనూరులో ఘర్షణకు వైసిపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. టిడిపి రౌడీ మూకలే పోలీసులపై దాడులకు పాల్పడ్డామన్నారు. చంద్రబాబు అధికారంలో లేకపోతే రాష్ట్రంలో అలజడులు సృష్టించడం, విధ్వంసాన్ని ప్రేరేపించడం, హింసను ప్రోత్సహించడం పరిపాటే అన్నారు. రాయలసీమ ప్రాంతానికి ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలైన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం వంటి ప్రాంతాలకు నీరు అందించి సస్యశ్యామలం చేయాలని సిఎం జగన్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తీసుకువచ్చారు. వీటిలో మొదటి దశ రాయలసీమ లిఫ్ట్ కొంత వరకూ ముందుకెళ్లిందన్నారు. ఈ క్రమంలో అందరినీ రెచ్చగొట్టి ఎన్జీటీకి పంపించి స్టే తీసుకొచ్చాడని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న గౌరవం ప్రజలందరికీ తెలుసు అన్నారు. అలాంటి మచ్చ లేని వ్యక్తిపై ఆరోపణలు చేయడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

జోనల్ స్థాయి టాలెంట్ టెస్టులో 'న్యూ వికాస్' ప్రతిభ

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఓ టాలెంట్ టెస్టులో న్యూ వికాస్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కర్నూలుకు చెందిన డ్రీమ్ క్యాచేర్స్ ఎడ్యుకేట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన జోనల్ స్థాయి టాలెంట్ టెస్టులో న్యూ వికాస్ స్కూల్ విద్యార్థులు కమల్నాథ్, నవనీత్, వైష్ణవి అలేఖ్య 25కు 25 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో విద్యార్థులకు కంపెనీ సిఇఒలు లోకేష్, చంద్రకళ, హెచ్ఆర్ రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు. ఇంతటి నైపుణ్యం కలిగిన విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్న పాఠశాల ఇన్‌ఛార్జి రజితను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఫుడ్ కమిషన్ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి సోమవారం మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు ఉదయం 9 గంటలకు ఉయ్యాలకుంట, ఎంపిడిఒ కార్యాలయం పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయన్నునట్లు తెలిపారు. అలాగే స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. తర్వాత నియోజకవర్గ అధికారులు, మండల అధికారులతో ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆలయాల్లో చోరీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని చదం గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన నగదును దోచుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.
అలాగే మండల పరిధిలోని మల్లాపురం చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియనిదుండగులు హుండీ పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల డివిఆర్‌ను ధ్వంసం చేసి ఆలయంలోని ఇనుప గ్రిల్స్‌ను విరగగొట్టి చొరబడినట్లు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉదయం గమనించిన ఆలయ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


చదం గ్రామంలో చోరీకి గురైన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

వాల్మీకి నాగరాజు కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-అనంతపురం

వాల్మీకి కుంపటి నాగరాజు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వాల్మీకి నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసా కల్పించారు.


నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు


నివాళులర్పిస్తున్న సాంబశివారెడ్డి

వి.కొత్తకోట పంచాయతీ అక్రమాలపై విచారించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని వి.కొత్తకోట పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎంపిటిసి తిమ్మరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచి తిమ్మరాజు ఐదు నెలల కిందట ఇఒఆర్‌డి సమక్షంలో ఆర్‌ఓ ప్లాంట్‌కు సంబంధించి వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.30 వేలకు పాట పాడి దక్కించుకున్నాడన్నారు. అయినా గ్రామంలో ఆర్వో ప్లాంట్ ద్వారా గ్రామంలో తాగునీరు అందజేయడం లేదన్నారు. ఆర్వో ప్లాంట్‌కు సంబంధించి మరమ్మతులు చేసేందుకు సర్పంచి తిమ్మరాజు సుమారు రూ.1.50లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారన్నారు. దీంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేసినట్లు దొంగ బిల్లులు చేసుకున్న సర్పంచుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతుయాదవ్, కుళ్లాయిస్వామి, ఖాదర్‌బాషా, మల్లన్న, ఎర్రిస్వామి, ఆనంద్, సంజప్ప, అనిల్, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిటిసి తిమ్మరాజు

వెంకటన్న మృతికి నివాళి

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన ఏకులపంగా వెంకటన్న (90) మృతికి ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి నివాళులర్పించారు. ఈమేరకు ఆదివారం గ్రామానికి చేరుకున్న ఆయన మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ గతంలో వెంకటన్న కామ్రేడ్ నాయకుడిగా తరిమెల నాగిరెడ్డి, చాగంటి సి.నారాయణరెడ్డి వంటి కమ్యూనిస్టు నాయకులతో కలిసి ఉద్యమాలు చేసిన ఘనత ఆయనదే అని కొనియాడారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచి బొమ్మన గోపాల్‌రెడ్డి, శౌరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

స్నేహితుల దినోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో స్నేహితులతో కలిసి ఆదివారం స్థానిక కిసాన్ అగ్రో సొల్యూషన్ ఆఫీస్ ప్రాంగణంలో మొక్కలు నాటి స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా వారి పుట్టినరోజులు, పండుగ, జాతీయ పండుగ రోజుల్లో ఏదైనా ప్రాముఖ్యత కలిగిన దినోత్సవం రోజున కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాల్సిన బాధ్యతలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. చెట్లను పెంచితే ఆ చెట్లే వాతావరణం కలుషితం కాకుండా కాపాడి అందరి ఆరోగ్యాలని కాపాడుతూ వర్షాలు కురవడానికి ఆధారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వార్థ సేవా సంస్థ అధ్యక్షులు వెంకట్ గురూజీ, శ్రీవాణి, జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్, కోమల, లక్ష్మీకళ, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు అందజేస్తున్న జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి నివాళి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా గద్దర్ అభిమాన సంఘం నాయకుడు ఓబులేసు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పాటల రూపంలో ప్రభుత్వాలనే ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యవంతులు చేసిన ఘనత గద్దర్‌కు దక్కుతుందన్నారు. భౌతికంగా ఆయన మధ్య లేకపోయినా పేదల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెన్నయ్య, శీను, హమీలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి-గుత్తి

మానవాళి మనుగడ కోసం మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు, నేషనల్ గ్రీన్ కాప్స్ గుత్తి డివిజన్ కార్యదర్శి శ్రీధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తొండపాడు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సహకారంతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ చెట్లు పెరగడం వల్ల వాతావరణ సమతుల్యం లోపించదన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మానవులు తోటి వారితో స్నేహం చేయడంతో పాటు మొక్కలతో స్నేహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు క్లస్టర్ హెడ్ అరవిందకుమార్, ఆపరేటింగ్ మేనేజర్లు నాగేశ్వరరావు, గోపాల్, సూర్యనారాయణ, సుబ్బారెడ్డి, డిప్యూటీ మేనేజర్లు బాలకృష్ణ, సుధాకర్, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కనాటి నీరు పోస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉచిత కంటి పరీక్షలు

అనంతపురం : నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరుకు చెందిన శంకర్ ఐ ఆసుపత్రి సిబ్బంది కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్‌తోపాటు ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, లయన్స్ క్లబ్ నిర్వాహకులు అసీఫుద్దీన్, నబీరసూల్, శంకర్ ఐ ఆసుపత్రి శివప్రకాష్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, మార్కెట్ శ్రీధర్, అక్కులు యాదవ్, అబ్దుల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న
అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి

పలువురు జనసేనలో చేరిక

ఉరవకొండ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆదివారం పలువురు జనసేనలో చేరారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరిన వారికి జనసేన వజ్రకరూరు మండల అధ్యక్షుడు అచ్చునాల కేశవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చాబల గ్రామానికి చెందిన యువత నారేంద్ర, రాజా, విజయ్, రాజశేఖర్, శివకుమార్, అంజి, మోహన్, రాజేష్, ఆంజినేయులు, విష్ణు, తదితరులు జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు హరి, శంకర్‌నాయక్, మండల కార్యదర్శి సూర్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన యువత

స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతపురం : ప్రసన్నయనపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గిరీష్ స్విమ్మింగ్ అకాడమీలో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా కె.రవిశేఖర్‌రెడ్డి, సెక్రటరీగా ఎస్.రాజశేఖర్, కోశాధికారిగా కెవి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా జిఎస్.విక్రమ్, వి.వెంకటరెడ్డి, సి.రవీంద్రనాథ్, లోకేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా టి.మధుమతి, ఎస్.శైలజ, కె.భగవతి, ఎం.రంగనాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్.సాయిసింధు, ఎం.శివప్రసాద్, జి.జయకృష్ణ, సురేష్ పెనకాలపాటి, బి.శ్రీకాంత్, వై.శ్రీనివాస్, బి.రాజేష్, సురేష్ కృష్ణ, లీగల్ అడ్వయిజర్‌గా బి.సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ అమెట్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ పరిశీలకునిగా వైస్ ప్రెసిడెంట్ ఎస్.రాజశేఖర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకునిగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.నరసింహారెడ్డి, ఎన్నికల అధికారిగా అడ్వకేట్ బి.సత్యనారాయణరెడ్డి వ్యవహరించారు.


నూతనంగా ఎంపికైన స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం సభ్యులు

ఎంపీ తలారి రంగయ్యను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ, విడపనకల్లు మండలాలకి చెందిన వైసిపి నాయకులు ఎంపి తలారి రంగయ్యను ఆదివారం కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఇప్పటికే హిందూ శ్మశాన వాటికలు, రోడ్ల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కోరిన వెంటనే నిధులు మంజూరు చేయడం పట్ల ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరిన్ని ఎంపీ నిధులతో తమ మండలాల్లో అభివృద్ధి పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎంపీ తలారి రంగయ్య కూడా సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో విడపనకల్లు మాజీ జడ్పిటిసి తిప్పయ్య, మండల కన్వీనర్ బసన్న, ఉరవకొండ వైస్ ఎంపిపి నరసింహులు, ఉరవకొండ ఉపసర్పంచి వన్నప్ప, వైసిపి బీసీ విభాగం నాయకులు వెలగొండ నాగప్ప, ఉలిగప్ప, ఇంద్రావతి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీరాములు, తదితరులు ఉన్నారు.


ఎంపి తలారి రంగయ్యతో ఉరవకొండ నియోజకవర్గ వైసిపి నాయకులు